పి. రాజారామమోహన రావు




# హారం

మొత్తం ఆ సాయంత్రానికి, రాత్రికి ఏర్పాట్లు జరిగాయి. పైసా ఖర్చులేదు. అవతలివాళ్ళు చాలా వినయంగా ఎన్ని గంటలకి వచ్చి రఘునాధాన్ని పికప్ చేసుకోవాలో అడిగారు.

'సాయంత్రం సరిగ్గా ఆరున్నరకి...' అన్నాడు రఘునాధం.

ఖర్చు అవతలివాళ్ళది వినయం అవతలివాళ్ళది, అవసరం అవతలివాళ్ళది. వాళ్ళకి రఘునాధంతో, రఘునాధం హోదాతో అవసరం ఉంది. రఘునాధానికి ఎలాంటి అబ్లికేషన్ లేదు.... వెడతాడు... వాళ్ళ మర్యాదలన్నీ అందుకుంటాడు. తనకి వీలుంటే, రిస్కు లేకపోతే.... లాభంవుంటే వాళ్ళ పని చేస్తాడు..... లేకపోతే లేదు. అతని హోదా అలాం




టిది. పెద్ద ఫైనాన్సింగ్ కంపెనీ చీఫ్ ఎడ్వయిజర్‌గా, ముఖ్యమైన కొందరు బిజినెస్ మాగ్నెట్స్‌కి సలహాదారుగా అతని హోదాకి అన్నివేపులా పలుకుబడి అంతగా వుంది.

ఆరు గంటలకి యింటికి వచ్చాడు రఘునాథం. స్నానం చేశాడు. తేలిగ్గా, సుఖంగా వుండే బట్టలు వేసుకున్నాడు. మైల్డ్ పెర్‌ఫ్యూమ్ స్ప్రే చేసుకున్నాడు. ఆరూ యిరవై అయిందికి రిలాక్సింగ్‌గా కూచున్నాడు....

పగలు పని, సాయంత్రం రిలాక్సింగ్.... రాత్రి ఆనందం అదీ రఘునాథం కోరుకునే జీవితం.

ఆరున్నర అయింది. రావాల్సినవాళ్లు రాలేదు. మరో మూడు నిముషాలు చూశాడు .... వాళ్ళు రాలేదు. మరో రెండు నిముషాలు గడిచేటప్పటికి సన్నటి పగుల్లోంచి నీళ్లు లీక్ అయినట్టు అతనిలోకి విసుగు, అసహనం ప్రవేశించాయి. అయిదు, పది నిముషాల ఆలస్యం సగటు భారతీయ జీవితాల్లో పెద్ద ఆలస్యం కాదు. అయినా అతనికి పట్టుకోవాల్సిన అవసరం లేదు. మరో అయిదు నిముషాలు గడిస్తే మరెవరికైనా ఫోన్ చేసి ఆ సాయంత్రాన్ని వేరేగా మార్చేసుకుని వుండేవాడే .... కానీ ఈలోపే.... అంటే ఆరూ ముప్పై ఏడు నిముషానికే రావాల్సినవాళ్ళు వచ్చారు ఏడు నిమిషాల ఆలస్యానికి మూడుసార్లు క్షమార్పణ చెప్పుకుని రఘునాథాన్ని కారు ఎక్కించుకున్నారు.

కారు ఆ వీధి దాటేలోపు రఘునాథం రిలాక్స్ అయిపోయాడు. విసుగు, కోపం, అసహనం అతనికి అంతర్లీన ప్రవా

హాలు వాటిని సాధ్యమైనంతవరకు బైటికి రానీయడు. తరచుగా అవి పైకి చెమర్చినా తుడిచేస్తుంటాడు.

డబ్బు, స్త్రీలతో పాటు యీనాటి వ్యాపారానికి మాటకారితనం కూడా కావాలి రఘునాధాన్ని ఆనాటి సాయంత్రంలోకి రాత్రిలోకి తమ అవసరంలోకి తీసుకెళ్ళటానికి వచ్చిన సుధీర్ మంచి మాటకారి రఘునాధంతో బాగా మాట కలిపాడు. మాటల్తో రఘునాధాన్ని నవ్వించాడు. చివరికి కారు గమ్యం చేరే సమయానికి

'ఆదిలోనే అపశకునంలా ఎనిమిది నిముషాలు ఆలశ్యం జరిగినా, యీ యీవినింగ్ ఈ నైట్ బాగుండేలాగే వుంది ' అనుకున్నాడు రఘునాధం.

విశాలమైన హాలు ఏర్పాట్లన్నీ చక్కగా వొద్దిగ్గా వున్నాయని మొదటి చూపులోనే గ్రహించాడు రఘునాధం.

హాలులోకి రాగానే "మా పార్టనర్స్‌ని కూడా పిలిచాను వూరికే పరిచయం కోసం కాస్సేపుండి వెళ్ళిపోతాడు ఆ తర్వాత మనం తీరిగ్గా మిగిలిన వ్యవహారాలన్నీ చూసుకోవచ్చు " అన్నాడు సుధీర్ నవ్వుతూ

'సరే' అన్నట్టు తలూపాడు రఘునాధం.

ఇంతకముందే అక్కడున్న యిద్దర్నీ తన పార్టనర్స్ అని పరిచయం చేశాడు సుధీర్. చేతులు కలపటం అయ్యాక "త్రిమూర్తుల్లా మొత్తం ముగ్గురు పార్టనర్స్ అన్నమాట " అన్నాడు రఘునాధం నవ్వుతూ

"మీ రన్నట్టు మొగవాళ్ళం ముగ్గురమే కానీ మరో ఆవిడ వుంది మొత్తం నలుగురం " అన్నాడు సుధీర్.

'ఆవిడేది?' అన్నట్టు యిటూ అటూ చూశాడు రఘునాధం.

"యింకా రాలేదు వస్తుంది వారు గంటా, అరగంటా ఆలస్యంగా వచ్చి స్పెషల్ అప్పియరెన్స్ యివ్వటం ఆవిడకి అలవాటు " అన్నాడు సుధీర్ స్నాక్ అందిస్తూ.

వ్యవహారం కొంచెం సరదాగానే వుంది అనుకున్నాడు మనసులో రఘునాధం

వో రౌండ్ అయింది. తక్కువ మాటలు, ఎక్కువ విస్కీతో గడిచింది సమయం. గుటకకీ, గుటకకీ మధ్య చప్పరించటానికి జీడిపప్పు, ఫ్రై, మటన్ రోల్స్, చికెన్ రోల్స్ వున్నాయి. ప్రత్యేకంగా చూస్తున్నట్టు కాకపోయినా టేబిల్ అంతా ఓసారి చూచాడు రఘునాధం అతనికి కావల్సినది కనిపించలేదు. ప్రాన్స్‌లేవు సరికదా కనీసం ఏ డ్రై సీఫుడ్ లేదు

'ఛ ' అనుకున్నాడు మనసులో స్నాక్ రుచి తగ్గినట్టు ఫీలయ్యాడు. తన కోసం ఏర్పాటుచేసిన పార్టీలో తనకి

కావాల్సింది ఏర్పాటు చెయ్యలేకపోటం, తన యిష్టంగురించి వాకబు చెయ్యక పోటం కొంచెం అసహనంగానే వుంది... 'అయినా కాస్సేపు వోపిక పడదాం' అనుకున్నాడు రఘునాధం

పేరుకి అవీ యివీ ముట్టుకున్నా రఘునాధం ఏదీ తింటంలేదని కాస్సేపటికి సుధీర్ గమనించాడు.

లోటు ఏమిటో అతనికి రఘునాధం చెప్పక్కర్లేకుండానే తెలిసింది పావుగంట గడిచేటప్పటికి ఆ టేబిల్‌మీద మత్స్య జాతి చేరింది. అది చూసి రఘునాధం తృప్తిగా నవ్వుకున్నాడు.

సుఖంగా, తృప్తిగా గడపాలి అ సాయంత్రమనే కాదు జీవితం మీదే రఘునాధం దృష్టి అది. సంసారం, జంజాటం పెట్టుకోలేదు తన సామర్థ్యం పెంచుకున్నాడు డబ్బు, హోదాకి అనుగుణంగా జీవితం అనుభవిస్తున్నాడు. చిన్నదైనా పెద్దదైనా జీవితంలో ఏ లోటుకీ తావివ్వకూడదు అది అతని ఫిలాసఫీ

వాతావరణం అనుకూలంగా వుంది. సుఖంగానే గడుస్తోంది. సుధీర్ బిజినెస్ వ్యవహారం ఏదో మొదలుపెట్టాడు. వింటున్నట్టు నటిస్తూ తలూపుతున్నాడు రఘునాధం. అప్పటి సుఖానికి అదనపు అలంకారం లాంటి నాలుగో పార్టనర్ కోసం అసంకల్పంగా ఎదురుచూస్తున్నాడు రఘునాధం.

మరో అయిదు నిముషాలకి రావాల్సిన ఆవిడ వచ్చింది. "మిసెస్ ఆనందరావు... మా నాలుగో పార్టనర్" అని పరిచయం చేశాడు సుధీర్.

రఘునాధం వేపే నవ్వుతూ చూట్టం తప్ప సుమిత్ర నమస్కారం చెయ్యలేదు సరికదా ఏరకంగానూ విష్ చెయ్యలేదు. రఘునాధం అలాగే చూస్తుండిపోయాడు.

"రఘునాధం అనగానే నువ్వే అయుంటావు అనుకున్నాను సుమా" అంది సుమిత్ర నవ్వుతూ వొచ్చి రఘునాధం పక్కనే కూచుంది.

"నాకు తెలుసు నువ్వు జీవితంలో యీ హోదాకి చేరతావని నీకు అప్పుడే చెప్పాను గుర్తుందా ఎనివే యింక మా పనిచేసే భారం నీదే కావాలంటే మళ్ళీ మనిద్దరం విడిగా కలిసే అవసరం వుంటే సుధీర్‌కి చెప్పు" అంది సుమిత్ర, నెమ్మదిగా.

రఘునాధం పూర్తిగా అప్‌సెట్ అయ్యాడు. అనుకోకుండా సుమిత్ర తారసపట్టం అందులో ఎవరో తనకి తెలియని ఆనందరావు మిసెస్‌గా చాలా ఇబ్బందిగా, అసహనంగా వుంది. అక్కడికి సుమిత్ర వచ్చే అవకాశం వుందని తెలిస్తే, అసలు వచ్చేవాడే కాదు.

మనసుకి గండిపడి పెద్ద ప్రవాహం లోపలికి చొచ్చుకు వస్తున్నట్టుంది. ఉక్కిరిబిక్కిరిగా వూపిరి అడనట్టుగా వుంది రఘునాధానికి. సుమిత్ర యిది

వరకటిలాగే చాలా సూటిగా మాట్లాడు తోంది. సూటిగా చూస్తోంది.

పదేళ్ళక్రితంకూడా యింత సూటిగానే తన అవసరాన్ని, అదతనాన్ని బైట పెట్టింది. మంచి అందగత్తె సుమిత్ర. రఘునాధం యిష్టపడే అందగత్తె.

రఘునాధం వుద్యోగంలో చేరిన కొత్త రోజులవి. అక్కడే పరిచయం అయింది.

"మనిద్దరం మంచి టీమ్ పెళ్ళి చేసు కుంటే యిద్దరం కలిసి సుఖపడగలం. పైకి రాగలం . నీమీద నాకు ఆ నమ్మకం వుంది. అందుకనే అడుగుతున్నాను" అంది

సుమిత్ర అంటే యిష్టమే రఘు నాధానికి అయినా సంసారం, కట్టుబడి వుండటం కన్నా హోదామీద, కెరియర్ మీద కాంక్ష ఎక్కువ ఏ బాదరబందీ లేని తుమ్మెద బతుకు బావుంటుంది అని పించింది అందుకే సుమిత్రను కొన్నాళ్ళు ఆగమన్నాడు కొన్నాళ్ళు కలిసి గడిపి ఆ తర్వాత పెళ్ళిచేసుకుందాం అన్నాడు. సుమిత్ర ఆ అవకాశం యిస్తుందను కున్నా కానీ సుమిత్ర అంతా తల్ల క్రిందులు చేసింది ఎవరోన్ని పెళ్ళిచేసు కుందని విన్నాడు. చాలా తరచుగా సుమిత్ర తలపుల్లో మెదిలినా కావాలనే మరచిపోయే ప్రయత్నం చేస్తూ వచ్చాడు.

'అప్టాల్ వో ఆడది నచ్చిన ఆడదే కావొచ్చు లేకపోతే జీవితానికి లోటా ' అనుకుంటూ మరింతగా తన కెరియర్ మీద కాన్సన్ట్రేట్ చేస్తూ వచ్చాడు. అతను ప్లాన్ చేసినవన్నీ సాధించుకున్నాడు అప్పటి స్థాయినుంచి యిప్పుడు చాలా దూరం వచ్చాడు రఘు నాధం ఎంత కాదనుకున్నా గతాన్ని కలిచి కలవరం రేపగలిగిన మహాశక్తి సుమిత్ర అతని ప్రాణానికి వో రకంగా ఆమెవల్లే తన జీవిత గమనాన్ని మార్చుకున్నాడు. తన సామర్థ్యం గుర్తించిన వ్యక్తి తన చెప్పుచేతులకి లోబడలేదన్న విషయం బతుకుపట్ల అతని పంతాన్ని పెంచింది. మళ్ళీ యిన్నాళ్ళకి సుమిత్ర కనపడి తిరిగి అంతా తల్లక్రిందులు చేస్తోంది

సుమిత్ర మాటల్లోని సూచన రఘు నాధాన్ని దెయ్యంలా పట్టుకుంది సుధీర్ గురించి, సుధీర్ కంపెనీ గురించి అంత వరకూ ఎంతో నిర్భాచీగా వున్న తనని ఆ పని చేసితీరాలని ఆ దేశిస్తోంది సుమిత్ర.

చెయ్యాలా? వద్దా? సుమిత్రను తిరిగి కలుసుకోవాలా? వద్దా? ఆమె వి దూరం చేసుకుని, జీవితాన్ని ఒంటరి చేసుకుని తను నిజంగా సుఖపడుతున్నాడా, బాధపడుతున్నాడా?

కొద్ది నిమిషాల్లో అంతా అయో మయంగా తయారైంది. మరో అర గంటకి అందరూ వెళ్ళిపోయారు. సుమిత్రా వెళ్ళిపోయింది వెడుతూ వెడుతూ "నే చెప్పింది మరచిపోకు ,

కాంటాక్ట్ మీ త్రూ సుధీర్.." అని వెళ్ళింది

మరి కాస్సేపటికి సుధీర్ వెళ్ళి పోయాడు. ఆ అందమైన గెస్టుహౌస్‌లో సుధీర్ వెళ్ళేముందు వచ్చిన ఖరీదైన అమ్మాయి, రఘునాథం మిగిలారు

రఘునాథం అక్కడికి వచ్చేముందే ఆ ఏర్పాటు గురించి తెలుసు. అతని అను మతితోనే అది జరిగింది.

చాలా అస్తవ్యస్తంగా తయారైంది రఘునాథం పరిస్థితి యిప్పుడు గుండెకు దగ్గరగా వచ్చి సుమిత్ర.. 'సుఖంవేరు . ఆనందం వేరు రఘునాథం' అంటు న్నట్టుంది.

ఏర్పాటు, ప్లేనింగ్ అని ఇంతకాలం జీవితాన్ని బలవంతంగా నొక్కిపెట్టిన రఘునాథానికి ఆ క్షణాన చాలా బలహీ నంగా అనిపించింది

తను కష్టపడక్కర్లేకుండా యితర్లు సుఖాల్ని కూర్చిపెడతున్నారు. హోదా వుంది ఏ బాదరబందీలేని జీవితం వుంది యివన్నీ రఘునాథం కోరుకుని సంపాదించుకున్నవే

అయినా విసుగ్గా వుంటోంది కోరు కున్నట్టు గడుపుతున్నా తృప్తి లేదు హృదయం కరువైన శరీరంలా బతుకు అలజడిగా వుంటోంది సుఖం, దుఃఖం, శ్రమ, అలసటా అన్నీ తనలో లోపలే యింకిపోతున్నట్టున్నాయి.

నాకోసం ప్రపంచం అనుకున్న రఘునాథానికి ప్రపంచంలో నేను ఎవ రికీ ఏమీ కాను అనిపించింది వో క్షణం అతని ఆనందం కోసం ఎవరో రెండువేలు పైగా ఖర్చుపెట్టిన ఆ రాత్రి అతనికి ఆనందం యివ్వలేదు చాలా సుఖాలు ఆనందం యివ్వటం మానే స్తున్నాయి కూడా వున్న అమ్మాయి రఘునాథానికి అనుకూలంగానే వుండాలని ప్రయత్నించింది. కానీ రఘునాథమే సరిగ్గా వుండలేకపోయాడు తనకి తనే అనుకూలంగా గడుపుకోలేక పోతున్నాడు. మామూలుకన్నా ఎక్కువగా తాగాడు. ఆ అమ్మాయిలో సుమిత్రని చూసుకోలేక, చూసుకోకుండా వుండలేక నానా హైరానా పడ్డాడు

కోరుకున్న జీవితం అందినా అవ సరైన జీవితం చాలా దూరంగా వున్నట్టు చీకట్లోకి దిక్కులు చూశాడు

తనకన్నా డబ్బులేనివాళ్ళు, ఏ రకం అధికారం లేనివాళ్ళు చాలామంది తన కన్నా తృప్తిగా, సజావుగా బతుకుతున్నా రన్న స్ఫురణ అంతర్లీనంగా ముల్లులా పొడుస్తోంది

ఎదుటివాళ్ళని వుపయోగించు కోవటమే తెలివైన జీవితం అనుకున్న రఘునాథానికి తను వోడిపోయాను అని పించింది వో క్షణం. ఆ భావనకి వాళ్ళు, మనుఘ అన్నేళ్ళ నమ్మకం జీలద రించాయి వోడిపోవాలని లేదు రఘు నాథానికి

'అప్తరాల్ సుమిత్ర కలిస్తే కలుస్తాడు లేకపోతే లేదు. పరిస్థితి అంతా తన కంట్రోల్‌లోనే వుంది తనకేం లోటు యీ క్షణాన కూడా తన అవసరానికి కావలసినవన్నీ వున్నాయి 'అనుకున్నాడు అనుకుని మరికొంచం లాగాడు. దగ్గరున్న అమ్మాయిని మరింత దగ్గరగా తీసుకున్నాడు.

నలుపెక్కిన నాగరికపు రాత్రితో కుస్తీపడుతున్నాడు రఘునాధం.

స్వచ్ఛంగా, సవ్యంగా బతికిననాటి సంస్కారం తెలియచెపుతూనే వుంది. మనిషితో కలిసి ప్రేమగా బతకటమే తృప్తి ఆనందం. .అంతేకాని ఉపయోగించుకోటం కాదని

అయినా రఘునాధం మోడరన్ తెలివితేటలు వాటి ప్రయత్నం అవి చేస్తూనే వున్నాయి. పైకి రానివ్వకూడదని అతను నిత్యం గొంతునులిమే సంఘర్షణ అతన్ని ఆ క్షణాన పూర్తిగా ఆక్రమించింది.

మరి కాస్సేపటికి ఏదో దూరం తనని కమ్ముకుంటున్నట్టనిపిస్తే బలాన్నంతా కూడదీసుకుని కళ్ళు పూర్తిగా తెరిచి పరీక్షగా చూచాడు రఘునాధం కౌగిలిలో అతి దగ్గరగా వున్న ఆ అమ్మాయి తనకి దూరంగా చాలా దూరంగా వున్నట్టనిపించేటప్పటికి వులిక్కిపడ్డాడు ప్రేమ స్పందనం కరువైన తన శరీరం కూడా తనకి చాలా దూరంగా వున్నట్టనిపించేటప్పటికి చాలా ఏళ్ళ తర్వాత తిరిగి భయపడ్డాడు రఘునాధం.

